క్లుప్తంగా

జిల్లాలో 54.3 మిల్లీమీటర్ల వర్షం

నెల్లూరు(అర్బన్): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిశాయి. పలు మండలాల్లో వాగులు, వంకలు ప్రవహించాయి. అత్యధికంగా బోగోలు మండలంలో 142.. అత్యల్పంగా వరికుంటపాడులో 8.2 మిల్లీమీటర్ల వర్షపాతం బుధవారం నమోదైంది. సరాసరిగా 54.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. పొదలకూరులో 122.2, అల్లూరులో 114.2, మనుబోలులో 111.4, దగదర్తిలో 106.2, వెంకటాచలంలో 84.2, బుచ్చిరెడ్డిపాళెంలో 84.2, తోటపల్లిగూడూరులో 79.4, ముత్తుకూరులో 72.4, కావలిలో 66.2, గుడ్లూరులో 66, జలదంకిలో 64.6, నెల్లూరు అర్బన్‌లో 63.2, ఉలవపాడులో 60.6, నెల్లూరు రూరల్‌లో 59.6, కొడవలూరులో 58.6, సంగంలో 58.6, రాపూరులో 56.6, కోవూరులో 53.6, కొండాపురంలో 52 సైదాపురంలో 51.2, విడవలూరులో 48, ఇందుకూరుపేటలో 45.8, లింగసముద్రంలో 43.6, కందుకూరులో 41.2, వింజమూరులో 39.2, అనుమసముద్రంపేటలో 37.4, వలేటివారిపాళెంలో 32.6, కలువాయిలో 25.4, చేజర్లలో 23.8, ఆత్మకూరులో 21.4, సీతారామపురంలో 13, కలిగిరిలో 12.8, ఉదయగిరిలో 12.8, దుత్తలూరులో 11.2, అనంతసాగరంలో 10.4, మర్రిపాడులో 8.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

నేడు, రేపూ తేలికపాటి వర్షాలు

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురు, శుక్రవారాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం ప్రకటించింది. కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురుస్తాయని తెలిపింది.

కలెక్టరేట్ వద్ద 18న ధర్నా



మాట్లాడుతున్న అన్నపూర్ణమ్మ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఆశ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులతో రాష్ట్ర ప్రభుత్వం జరిపిన చర్చల్లో కుదిరిన ఒప్పందాల జీఓలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద ఈ నెల 18న చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ పిలుపునిచ్చారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో బుధవారం మాట్లాడారు. సుజాత, లత, స్వర్ణ పాల్గొన్నారు.

ధర్నాకు భారీగా తరలిరండి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ప్రజాపోరు యాత్ర చివరి రోజున నగరంలో భారీ ర్యాలీని నిర్వహించి కలెక్టరేట్ వద్ద మహాధర్నాను గురువారం చేపట్టనున్నామని, దీనికి భారీగా తరలిరావాలని సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ప్రజాపోరు యాత్రలో భాగంగా నగరంలోని కోటమిట్ట సెంటర్, కుక్కలగుంట, సంతపేట, రంగనాయకులపేట, ములుమూడి బస్టాండ్, పాత మున్సిపల్ కార్యాలయం తదితర ప్రాంతాల్లో బుధవారం పర్యటించారు. నేతలు చంద్రారెడ్డి, రషీద్, శ్రీనివాసులు, ఫయాజ్, నాగేశ్వరరావు, ప్రసాద్, నరసింహ, పద్మ, అమన్, అశోక్, భాగ్యమ్మ పాల్గొన్నారు.

అప్రమత్తతతో మధుమేహానికి చెక్

నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకం

- వయస్సుతో నంబంధం లేకుండా విస్తరిస్తున్న వ్యాధి
- జిల్లాలో 6.5 లక్షల మందికిపైగా బాధితులు
- వైద్యానికే ప్రతి నెలా రూ.5.5 కోట్ల ఖర్చు
- వరల్డ్ డయాబెటిస్ డే నేడు

ఇవీ లక్షణాలు..

- బాగా నీరసంగా ఉండటం.. తరచూ మూత్రానికి వెళ్లడం.
- ఎక్కువగా దాహమవడం.. ఆకలి అధికంగా రావడం.
- బరువు తగ్గడం, ఒక్కో దఫా కంటి చూపు మందగించడం.
- గాయాలు త్వరగా మానకపోవడం.



నెల్లూరు(అర్బన్): జిల్లాలో మధుమేహం చాపకింద నీరులా విస్తరిస్తోంది. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా, వ్యాధి నియంత్రణ కోల్పోయి ఆరోగ్య సమస్యలు విపరీతంగా వస్తాయి. ఒక్కోసారి కాలు లాంటి భాగాలనే తొలగించాల్సిన పరిస్థితి ఉత్పన్నమవుతుంది. అదుపులో లేని షుగర్‌తో బీపీ సైతం వచ్చే అవకాశం ఉంది. డయాబెటిస్ ఉందనే విషయం తెలిసేందుకు చాలా సమయం పట్టొచ్చు. దీన్ని దృష్టిలో ఉంచుకొని మధుమేహంపై ప్రజల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో 1991 నుంచి ఏటా నవంబర్ 14ను ప్రపంచ డయాబెటిస్ దినోత్సవాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వహిస్తోంది.

ప్రతి నలుగురిలో ఒకరికి..!

జిల్లాలో సుమారు 26 లక్షల మంది జనాభా ఉండగా, వీరిలో 6.50 లక్షల మందికి షుగర్ వ్యాధి ఉందని ఐఎంఏ వైద్యులు పేర్కొంటున్నారు. ఇలా ప్రతి నలుగురిలో ఒకరికి డయాబెటిస్ ఉందనే అంశం ఆందోళన కలిగిస్తోంది. చిన్నారులకు సైతం ఈ వ్యాధి వస్తోందంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. నిర్లక్ష్యం వహిస్తే శరీరంలోని ప్రధాన అవయవాలూ దెబ్బతినే ప్రమాదం ఉంది. ఈ కారణంగానే దీన్ని సైలెంట్ కిల్లర్‌గా అభివర్ణిస్తుంటారు.

వ్యాధికి కారణాలు..

మారిన ఆహార అలవాట్లు.. శారీరక శ్రమ లేని జీవితం.. కంప్యూటర్లు, కుర్చీలకు అతుక్కుపోయి పనిచేసే విధానం.. వ్యాయామం లేకపోవడం.. ఊబకాయంతో షుగర్ వచ్చే అవకాశం ఉంది. వంశపారంపర్యంగానూ ఇది వచ్చేందుకు ఆస్కారం ఉంది. శరీరంలో ఇన్సులిన్ హార్మోన్ ఉత్పత్తి, దాని పనితీరు తగ్గడంతో తిన్న ఆహార పదార్థాలు చక్కెరగా మారి రక్తంలో కలిసే ప్రక్రియలో ఆటంకాలు ఏర్పడటంతో షుగర్ వ్యాధి బారినపడుతున్నారు. రక్తంలో గ్లూకోజ్ పరిమాణం బాగా పెరిగిపోతే తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది.

నిర్లక్ష్యం చేస్తే ప్రమాదమే

షుగర్ వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే మెదడుకు వెళ్లే రక్తనాళాల్లో రక్తప్రసరణ సక్రమంగా జరగదు. దీంతో శరీర భాగాలు పక్షవాతానికి గురవుతాయి. వ్యాధి ఉన్న ప్రతి నలుగురిలో ఐదేళ్ల తర్వాత కంటి రెటీనా పొర దెబ్బతినే అవకాశమూ ఉంది. ఇలా జరగడాన్ని డయాబెటిస్ రెటినోపతిగా పిలుస్తారు. డయాబెటిస్ ఉండే ప్రతి ఆరుగురిలో ఒకరికి గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంది. లైంగిక సామర్థ్యం తగ్గుతుంది. కాళ్లకు ఇన్‌ఫెక్షన్లూ పెరగడంతో పాటు నాడీ వ్యవస్థ దెబ్బతినే అవకాశాలెక్కువ. మూత్రపిండాలు, కిడ్నీలు దెబ్బతినే ప్రమాదం పొంచి ఉంది. ప్రస్తుతం షుగర్ ఉండే ప్రతి ఆరుగురిలో ఒకరు చిన్నపిల్లలు కావడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో టైప్ – 1 డయాబెటిస్‌కు 20 వేల మందికిపైగా చిన్నారులు గురయ్యారని లెక్కలు తెలియజేస్తున్నాయి. పెద్దల్లో టైప్ – 2 డయాబెటిస్ ఉంటుంది.

మందులకే భారీగా ఖర్చు

డయాబెటిస్‌కు ప్రభుత్వాస్పత్రుల్లో మందులిస్తున్నా, 80 శాతం మంది రోగులు బయటి డాక్టర్ల వద్దకెళ్లి పరీక్షలకు చేయించుకొని మందులను కొనుగోలు చేస్తున్నారు. మరోవైపు పలువురు డాక్టర్లకు అర్హత లేకపోయినా, షుగర్ వ్యాధి నిపుణులనే బోర్డులు పెట్టుకుంటున్నారు. వీరి వద్దకెళ్తే రోగికి నెలకు రూ.నాలుగైదు వేల మేర మందులు రాస్తున్నారు. ఇలా పరీక్షలు, మందులకు కలిపి జిల్లాలో నెలకు రూ.5.5 కోట్లను ఖర్చు చేస్తున్నారని అంచనా.

నియంత్రణతోనే మేలు

డయాబెటిస్‌ను పూర్తిగా నయం చేయలేం. నియంత్రణలో ఉంచుకునేందుకు మందులను క్రమం తప్పకుండా వాడాలి. తగిన వ్యాయామాన్ని తప్పక చేయాలి. ఆహారంలో మార్పుల ద్వారా నియంత్రించొచ్చు. శీతల పానీయాలకు దూరంగా ఉండాలి. బీన్స్, కాయగూరలు, ఆకుకూరలను ఆహారంలో ఎక్కువగా తీసుకోవాలి. ఆరోగ్యకరమైన నూనెలు వాడాలి.

నియంత్రణలో ఉంటే భయమక్కర్లేదు



మధుమేహాన్ని నియంత్రణలో ఉంచుకోగలిగితే భయపడాల్సిన అవసరమే లేదు. డాక్టర్ల సూచనలు పాటిస్తూ.. వ్యాయామం చేస్తూ.. అతి తక్కువ ఖరీదుకే దొరికే మందులతోనే షుగర్‌ను నియంత్రించుకోవచ్చు. పిల్లల్లో టైప్ – 1 డయాబెటిస్ ఎక్కువగా వస్తుంది. వీరికి ఇన్సులిన్‌ను తప్పక ఇవ్వాలి.

– గంగాధర్, అసోసియేట్ ప్రొఫెసర్, జీజీహెచ్, నెల్లూరు

ఆహార నియమాలు పాటించాలి



డయాబెటిస్ ఉన్న వారు ఆహార నియమాలను తప్పక పాటించాలి. జంక్ ఫుడ్స్, కూల్‌డ్రింక్స్ జోలికెళ్లకూడదు. కూరగాయలు, రాగులు, జొన్నలు, సజ్జలు లాంటి వాటితో చేసిన ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవాలి. తెల్లటి బియ్యంతో కూడిన ఆహారాన్ని దాదాపు తగ్గించేయాలి. రోజూ వ్యాయామం చేయడం ద్వారా నియంత్రణలో ఉంచుకోవచ్చు.

– దత్తాత్రేయులు, డాక్టర్, రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల

నేటి నుంచి సహకార వారోత్సవాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలో సహకార వారోత్సవాలను గురువారం నుంచి ఈ నెల 20 వరకు నిర్వహించనున్నామని డీసీఓ గుర్రప్ప పేర్కొన్నారు. నగరంలోని డీసీఓ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. సహకార పతాకావిష్కరణ.. సభ్యులతో ప్రతిజ్ఞ.. సహకార ర్యాలీలు తదితరాలను నిర్వహించనున్నామని వివరించారు.

మహాకుంభాభిషేక మహోత్సవాలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని గణేశ్ ఘాట్ వద్ద వెలసిన స్వర్ణలింగేశ్వరస్వామి దేవస్థాన మహాకుంభాభిషేక మహోత్సవాలను శుక్రవారం నుంచి నిర్వహించనున్నామని కార్తీక దీపోత్సవ సమితి నిర్వాహకులు బుధవారం తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

కళాత్మక శుభాకాంక్షలు

నెల్లూరు(బృందావనం): బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని రావి ఆకుపై జవహర్‌లాల్‌నెహ్రూ, బాలల చిత్రాన్ని సూక్ష్మ కళాకారుడు, ఉపాధ్యాయుడు గంధవళ్ల ఉమాశంకర్ తీర్చిదిద్దారు. చిల్డ్రన్స్ డే శుభాకాంక్షలను తెలియజేశారు.

రంగడికి బంగారు గరుడసేవ

నెల్లూరు(బృందావనం): చిలుకు ద్వాదశిని పురస్కరించుకొని నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో తిరుమంజనాన్ని నిర్వహించారు. అనంతరం బంగారు గరుడసేవను జరిపారు. తదుపరి రంగనాథస్వామి, తులసి అమ్మవారికి తులసి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. దేవదాయ శాఖ జిల్లా అధికారి జనార్దన్‌రెడ్డి, ఈఓ శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ప్రయాణికులకు అన్ని సౌకర్యాలు



రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న రాంబాబు

నెల్లూరు(సెంట్రల్): రైల్వే ప్రయాణికులకు అన్ని సౌకర్యాలను కల్పించనున్నామని విజయవాడ రైల్వే డివిజనల్ కమర్షియల్ మేనేజర్ రాంబాబు పేర్కొన్నారు. నెల్లూరు, కావలి, గూడూరు రైల్వేస్టేషన్లను బుధవారం పరిశీలించిన ఆయన ప్రయాణికుల నుంచి పలు సూచనలు, సలహాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రయాణికులకు అనుగుణంగా ఉండేలా వివిధ సౌకర్యాలతో రైల్వేస్టేషన్ మెరుగులు దిద్దుకుంటోందని చెప్పారు. నెల్లూరు రైల్వేస్టేషన్లో భవనాలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దనున్నామని వెల్లడించారు. కొద్ది నెలల్లోనే ప్రయాణికులను అందుబాటులోకి తీసుకురానున్నామని ప్రకటించారు.

నేటి నుంచి కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



మాట్లాడుతున్న పెంచలయ్య

నెల్లూరు(అర్బన్): జిల్లాలో ఇంటింటా ప్రాథమిక కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం నుంచి నిర్వహించాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య పేర్కొన్నారు. నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో అన్ని పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. శిక్షణ పొందిన నర్సింగ్ సిబ్బంది ఇళ్ల వద్దకొచ్చి గర్భాశయ, రొమ్ము కేన్సర్ లక్షణాలను ఆరాతీయనున్నారని చెప్పారు. అనుమానితులను డాక్టర్ వద్దకు తీసుకెళ్లి పరీక్షలు చేయించనున్నారని తెలిపారు. ఏడీఎంహెచ్‌ఓ, టీబీ నివారణాధికారి ఖాదర్‌వలీ, జ్ఞాన చెస్ట్ హాస్పిటల్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ కాటంరెడ్డి కౌశిక్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ బ్రిజిత, జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ, డీపీఎంఓ డాక్టర్ రమేష్, డెమో అధికారి కనకరత్నం, ఎస్‌ఓ సహన, డీపీఓ రమేష్‌బాబు పాల్గొన్నారు.

వేడుకగా తులసీ, దామోదర కల్యాణోత్సవం



నెల్లూరు(బృందావనం): చిలుకు ద్వాదశిని పురస్కరించుకొని బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో తులసీ, దామోదర కల్యాణోత్సవాన్ని కనులపండువగా బుధవారం నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని మందిర ప్రధానార్చకుడు, వైఖానస ఆగమ పండితుడు బృందావనం శ్రీనివాసదీక్షితులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరిపారు. ఈ సందర్భంగా మందిర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు తన్నీరు మస్తాన్‌రావు, సోమిశెట్టి వెంకటరత్నం మాట్లాడారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని 1008 ప్రమిదలతో సహస్ర జ్యోతిర్లింగార్చనను శుక్రవారం సాయంత్రం నిర్వహించనున్నామని పేర్కొన్నారు. మందిర కమిటీ కోశాధికారి శివప్రసాద్, వాకాటి నరసయ్య త్యాగరాజ కల్యాణ మండప కమిటీ నిర్వాహకులు అమరా మోహన్‌రావు, సభ్యుడు పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

'జటాయు'తో రోడ్ల శుభ్రత



యంత్ర పనితీరును పర్యవేక్షిస్తున్న సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): రోడ్ల పరిశుభ్రత.. పారిశుద్ధ్య పనులను జటాయు యంత్ర సాయంతో అతి తక్కువ సమయంలో పూర్తి చేయొచ్చని కమిషనర్ సూర్యతేజ పేర్కొన్నారు. నగరంలోని వీఆర్ కళాశాల మైదాన సమీపంలో జటాయు యంత్ర పనితీరును బుధవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. చిన్న వ్యర్థాలతో పాటు కొబ్బరి బోండాలను సైతం వాక్యూమ్ ప్రెషర్ పద్ధతిలో పీల్చేసి రోడ్లను శుభ్రపరుస్తుందని తెలిపారు. వాహనాల కొనుగోలు ప్రక్రియలో భాగంగా జటాయు యంత్ర సాయంతో నగరంలో నెల పాటు పారిశుద్ధ్య పనులను చేపట్టనున్నామని వివరించారు. మెరుగైన ఫలితాలను కనబరిస్తే నూతన యంత్రాలను కొనుగోలు చేసి అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు.

పన్నులను సకాలంలో చెల్లించండి

పన్నులను సకాలంలో చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పడాలని కమిషనర్ కోరారు. మినీబైపాస్‌లోని వివిధ వాణిజ్య భవనాలు, నూతన భవన నిర్మాణాలను పలు విభాగాధికారులతో కలిసి పరిశీలించారు. టౌన్‌ప్లానింగ్ విభాగ అనుమతుల మేరకు నిర్మాణాలు జరిగాయా లేదా అనే అంశాన్ని తెలుసుకునేందుకు గానూ కొలతలేయించారు. మొండి బకాయిలను వసూలు చేయాలని ఆదేశించారు. నుడా ఎన్టీఆర్ పార్కును పరిశీలించారు. పెండింగ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, అతి త్వరలో అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, హెల్త్ ఆఫీసర్ చైతన్య, సిటీ ప్లానర్ కృష్ణకిశోర్ పాల్గొన్నారు.

కృష్ణ మందిరంలో పూజలు

నెల్లూరు(బృందావనం): కార్తీక శుద్ధ ద్వాదశిని పురస్కరించుకొని వేదాయపాళెంలోని కృష్ణ మందిరంలో లక్ష్మీనారాయణులకు విశేష పూజలను బుధవారం నిర్వహించారు. పూజా కార్యక్రమాలను మందిర ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో జరిపారు. ఉభయకర్తలుగా అచ్యుత ప్రభాకర్, మానస దంపతులు వ్యవహరించారు. భవానీశంకరుడికి అభిషేకాలు, పూజలు చేశారు. మందిర కమిటీ ప్రధాన కార్యదర్శి సుబ్బరామరాజు, మహిళా కార్యదర్శులు రజనీకాంతమ్మ, నిర్మల, భానుమతి, సుబ్బరత్నమ్మ పాల్గొన్నారు.

సీఎంను కలిసిన సురేష్‌రెడ్డి

నెల్లూరు రూరల్: సీఎం చంద్రబాబును ఆయన క్యాంప్ కార్యాలయంలో ఆర్టీసీ నెల్లూరు రీజినల్ జోన్ బోర్డు చైర్మన్‌గా నియమితులైన బీజేపీ నేత సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. ఈ సందర్భంగా కృతజ్ఞతలను తెలియజేశారు. అదే విధంగా ఎమ్మెల్యేలు సుజనాచౌదరి, కామినేని శ్రీనివాస్, విష్ణుకుమార్‌రాజును కలిశారు.

ఆలయంలో చోరీ

నెల్లూరు సిటీ: సౌత్‌మోపూరులోని మాతమ్మ ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి మంగళవారం అర్ధరాత్రి పాల్పడ్డారు. వివరాలు.. ఆలయాన్ని మంగళవారం రాత్రి యథావిధిగా మూసేశారు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించి రూ.రెండు లక్షల విలువైన అమ్మవారి బంగారు నగలు, హుండీలోని నగదును చోరీ చేశారు. ఆలయానికి ఉదయం వచ్చిన అనంతరం చోరీ ఘటనను నిర్ధారించుకున్నారు. ఘటనపై రూరల్ పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

షుగర్ వ్యాధిపై నిర్లక్ష్యం తగదు

నెల్లూరు(అర్బన్): షుగర్ వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే కాళ్లకు రక్త ప్రసరణ తగ్గి ఒక్కో దఫా కాలును తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వాస్కులర్ సర్జన్ సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ డయాబెటిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పొగతోటలోని నెల్లూరు వాస్కులర్ సెంటర్‌లో బుధవారం ఆయన మాట్లాడారు. వాస్కులర్ సర్జరీ ద్వారా రక్త ప్రసరణను మెరుగుపర్చుకుంటే ఎలాంటి ఇబ్బందులు రావని చెప్పారు.

ఎల్జీ షోరూమ్‌లో చోరీ



విచారణ జరుపుతున్న రోశయ్య

నెల్లూరు(క్రైమ్): నగరంలోని ఆమని గార్డెన్స్‌లో ఉన్న ఎస్సెస్ డిజిటల్స్ ఎల్జీ బెస్ట్ షాపీలో గుర్తుతెలియని దుండగులు చోరీకి మంగళవారం అర్ధరాత్రి పాల్పడ్డారు. షోరూమ్ సీలింగ్‌కు ఉన్న రేకులను పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. క్యాష్ కౌంటర్‌లోని రూ.66 వేలను అపహరించుకెళ్లారు. దుకాణానికి బుధవారం ఉదయం వచ్చిన యజమాని తిలక్.. చోరీ విషయాన్ని నిర్ధారించుకొని దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలాన్ని ఇన్‌స్పెక్టర్ రోశయ్య పరిశీలించారు. వేలిముద్రలను క్లూస్‌టీమ్ సేకరించింది. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సీతాకుమారికి బెస్ట్ టీచర్ అవార్డు



సీఎం చేతుల మీదుగా అవార్డును అందుకుంటూ..

నెల్లూరు (టౌన్): నెల్లూరుకు చెందిన సీతాకుమారికి రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్ర విభాగంలో ప్రొఫెసర్‌గా ఈమె పనిచేస్తున్నారు. జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని విజయవాడలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

భక్తిశ్రద్ధలతో పవిత్రోత్సవాలు



నెల్లూరు సిటీ: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో పవిత్రోత్సవాలను మూడో రోజు బుధవారం నిర్వహించారు. విశేష పూజా కార్యక్రమాలను జరిపారు. వైఖానస ఆగమ విద్వాన్ సత్యనారాయణాచార్యులు, ఆలయ ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు, ఈఓ గోపీ తదితరులు పాల్గొన్నారు.

మధుమేహం.. ఆరోగ్యంపై సదస్సు నేడు

నెల్లూరు(అర్బన్): మధుమేహంతో సంభవించే అనర్థాలు, పాటించాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ హరనాథపురంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో అవగాహన సదస్సును జేవీవీ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం నిర్వహించనున్నామని వేదిక ఆరోగ్య సబ్ కమిటీ జిల్లా కన్వీనర్ డాక్టర్ శ్రీనునాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు హాజరుకావాలని కోరారు.

ఆర్టీసీలోని హోటల్‌కు జరిమానా

నెల్లూరు సిటీ: నగరంలోని ఆర్టీసీ ప్రధాన బస్టాండ్‌లో గల ఓ హోటల్‌కు రూ.నాలుగు వేల జరిమానాను ఒకటో డిపో మేనేజర్ మురళీకృష్ణ బుధవారం విధించారు. వివరాలు.. నెల్లూరు నుంచి వెంకటగిరి వెళ్లేందుకు గానూ ఓ ప్రయాణికుడు ఈ నెల తొమ్మిదిన వచ్చారు. ఈ క్రమంలో ఆర్టీసీలోని పద్దూస్ కిచెన్ హోటల్‌కు వెళ్లారు. ప్లేట్ ఇడ్లీని ఆర్డర్ చేసిన అనంతరం రూ.30 బిల్లు కాగా, రూ.50 చెల్లించాలని నిర్వాహకుడు సూచించారు. బోర్డులో పేర్కొన్న తరహాలో ధరలు వసూలు చేయడం లేదని.. పైగా నాణ్యతా సక్రమంగా లేదని డిపో మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపారు. అధిక ధర వసూలు చేయడంపై రూ.రెండు వేలు.. నాణ్యత లోపం కారణంగా మరో రూ.రెండు వేల జరిమానాను విధించారు.